# అమ్మా! మన్నించాలి

సాయంత్రం సూరీడు కొండదిగి అప్పటికే రెండు గంటలయ్యిందేమో ఎరుపు- పసుపుల నారింజరంగుని పులుముకున్న ఆకాశం నలుపు రంగు లోకి తిరుగుతోంది. పౌర్ణమి కాదుగానీ, మరో నాలుగురోజుల్లో రాబోయే పౌర్ణమిని తలుచుకుంటూ వెన్నెలతో చెట్టాపట్టా లేసుకుని చంద్రుడు ఆకాశంలోకి వ్యాహ్యాళికి దిగేశాడు. వాళ్ళకి రక్షక భటుల్లా నక్షత్రాలు గుంపులుగుంపులుగా గుమికూడాయి.

అమ్మన్న ఆవు పేడతో మెత్తిన అరుగుమీద, కిరసనాయిలు గుడ్డిదీపం వెలుతురులో ముగ్గుల దిద్దుకుంటూ- వులిక్కిపడి తలతిప్పి చూసేసరికి ఏముంది-కిట్టమ్మ పేరెట్టుకున్న ఆవు తోక పైకెత్తి గాబరాగా కదం తొక్కుతూ- అమ్మన్న వైపు చూస్తూ అరుస్తోంది. అది చూడగానే అమ్మన్న గుండె కలుక్కుమంది. ఏదో జరగరానిది జరిగిపోయిందే అనిపించ గానే, చేతిలో వున్న ముగ్గుబుట్ట జారి పోయి- ముగ్గు తెల్లగా వెలవెలబోతూ నేల మీద పరుచుకుంది. వంగిపోయిన నడుముని నిటారు చెయ్యలేక, అలాగే వంగి నడుస్తూ మెట్లు దిగి కిట్టమ్మ దగ్గరికి చేరగానే-కిటమ్మ రోడ్డు మీదకు



-జయ

రమ్మన్నట్టుగా అడ్డదిడ్డంగా గంతు లేసుకుంటూ పరుగులెత్తింది. దాని ప్రవర్తన అర్థం అయ్యీఅవ్వ నట్టుగా వుండేసరికి అమ్మన్నలో కంగారు పుట్టింది. అలాగే వున్న పళాన తలుపులు వదిలేసి, దీపం ఒత్తి పెద్దచేసి గూట్లో పెట్టకుండానే అరుస్తున్న మిగతా ఆవుల్ని గమనించకుండానే కిట్టమ్మ వెనుక పరిగెత్తబోతే నడుం కలుక్కుమంది. కుడిచేత్తో వంగిపోయిన నడుముని సవరదీసుకుని- కిట్టమ్మ వెనుకే పట్టువదిలేసిన కాళ్ళకి పరుగు చెప్పింది.

తన వెనుకే అమ్మన్న రావడం గమనించి ఆవు మోరచాచి, బారగా అరుచుకుంటూ గోదావరి వైపు కదిలింది. వీరప్పగారి అరుగు మీద చేరిన ముత్తయిదువుల్తో భజన చేస్తున్న శాస్త్రిగారి భార్య అమ్మన్నని చూసి ఆశ్చర్యపోతూ- గొంతెత్తి-దీపాలు పెట్టేవేళ- ఇప్పుడు ఎక్కడికి బయల్దేరారు అని కేకవేసింది.

అమ్మన్నకి లోకం వినిపించడం లేదు. కనిపిం చడంలేదు- తన ఆవుబాధ తప్పితే. ఎనభైఏ ళ్ళని ఓపిగ్గా అనుభవించిన శరీరం తడబడుతున్న అడుగులతో కదులుతుండి-గొంతెండిపోయి, కళ్ళు చెమరుస్తున్నాయి. ఆయాసంతో రొప్ప వస్తూంది. కిట్టమ్మ ఒంటిమీద తెలుపు నలుపుమచ్చలు నల్లబా రుతున్న చీకటితో తెల్లనౌతున్న వెన్నెలలో విచిత్రంగా మెరు స్తున్నాయి. తోకజండాలా ఎత్తి, నోట్లోంచి చొంగ కారుతుంటే, గిట్టలతో నేలని తన్నిపెడుతూ ముందుకి పరుగె డుతూ- మధ్యమధ్యలో ఆగి అమ్మన్న వైపు చూస్తు వెర్రిగా అరుస్తోంది.

రోడ్డుకి ఇరువైపులా వున్న బారులు తీరిన ఈతచె ట్లపైగూళ్ళు కట్టుకున్న వడ్ల పిట్టలు కొంపలు మును గుతున్నట్టు గోలచేస్తున్నాయి. గోదావరి ఒడ్డున

ఈశ్వరాలయంలో అర్చన చేసి, దీపంపెట్టి సైకి లెక్కి ఇంటికి వెళుతున్న ఆచారిగారు ఎదురువస్తున్న అమ్మన్నవైపు ఆశ్చర్యంగా చూసి, ఆగి ఏమిటో అడిగే లోపలే ఆవిడ కిట్టమ్మే తన ధ్యాసగా వెళ్ళిపోయింది.

వరిచేల పైనుంచి బారులు తీరి వెళ్ళిపోతున్నాయి కొంగలు. ఇళ్ళకు మందల్ని తోలుకెడు తున్న పాలేర్లు అమ్మన్నని చూడగానే ఆశ్యర్యంగా నోర్లు తెరిచేసి, అంతలోనే తేరుకుని గుడ్లు మిటకరించి, నాలిక్కరుచుకుని తోవకి అడ్డంగా పోతున్న తమ మందల్ని ప్రక్కకి అదిలించారు.

కీచురాళ్ళు ఒకటే ఝణఘణధ్వనిగా అరుస్తు న్నాయి. కోమటి మంగయ్య ట్రాక్టరు మీద వస్తూ, అమ్మన్న రావడం గమనించి బండిని సైడు తీసి, నిలిపి, అ ట్రాక్టరు దిగి ఆవిడని పలకరించడా నికే ప్రయత్నించే లోపలే అమ్మన్న కిట్టమ్మతో కలిసి లాకులు దాటేసింది.

లాకు గేటులు ఎత్తారేమో హోరుమని గోదావరి నీళ్ళు కట్టలు తెంచుకుని లాకుల్లోకి వస్తున్నాయి.

కిట్టమ్మ లాకులు దాటి, గోదావరి పాయలుగా విడిపోయిన చోట పచ్చిక బయళ్ళు పెరిగి లంకగా మారిన వైపు పరిగెడుతోంది. కిట్టమ్మతో సమంగా పరిగెట్టడం అంటే అమ్మన్నకు ప్రాణం తెగిపోతున్నట్టుగా వుంది. కిట్టమ్మ ఎందుకలా పరుగులు తీస్తోందో, ఇప్పుడు ఆవిడకు అర్థం అయ్యింది. నల్లనయ్యకు ఏదో జరిగింది. కిట్టమ్మ ఆవుకు పుట్టి మూడు వారాలు దాటని ఆవుదూడ నల్లనయ్య అంటే అమ్మన్నకు ప్రాణం. ఒళ్ళంత నిగనిగలాడిపోతూ నలుపుతో, నుదుటి మీద మాత్రం బొట్టుపెట్టినట్టుగా తెల్లటి మచ్చ. శివాలయంలో జ్యోతిలా ఆ తెల్లమచ్చ వెలిగిపోతూ వుండేది. దాని కాళ్ళకి మువ్వలు కట్టి నుదుట పసుపు కుంకాలు అద్ది, మెడలో చిన్న గంట కట్టి పడిన ముచ్చటు, ముద్దు ఇంకా తీరనే లేదు.. అలాంటి నల్లనయ్యకు ఏదో జరిగింది అనిపించగానే అమ్మన్నకు అక్కడే కూలబడి గోదావరి ఇసకలో పొర్లి పొర్లి ఏడ్చి గగ్గోలు పెట్టాలనిపించింది. ప్రాణం ఉగ్గ బెట్టుకుని, ఊపిరి చేతబట్టుకుని, గోదావరి పాయలను దాటుకుంటూ కిట్టమ్మ వెనుక పది బారలు నడిచిందో లేదో...

కిట్టమ్మ ఆకాశంలోకి మోలచాచి, దిక్కులు పిక్కటిల్లేటట్టు దీనంగా అంబా అంటూ అరిచి, నాలుగు కాళ్ళు బారచాచి, నోట్లోంచి నురుగలు కక్కుకుంటూ ఇసుకలో కూలిపోయింది. దాని అరుపు వినగానే అమ్మన్న గుండె జవజవలాడింది. చిక్కని చీకట్లో కూడా తెల్లటి నురగలతో గోదావరిసుడిగుండం దయలేని విధిలా నవ్వుతూ సుళ్ళు తిరుగుతోంది. అంత నలుపులో కూడా మెరుస్తున్న నల్లటి చర్మం, నుదుటి మధ్య వెలుగుతున్నట్టుగా తెల్లటి మచ్చతో 'నల్లనయ్య' ఆ సుడిగుండంలో పడి జీవం కోల్పోయి, నాలుక బయటకు నిగిడ్చి పెట్టి తిరుగుతుంటే "గోదావరి తల్లీ! మా మీద ఎంత చిన్న చూపు చూశావు తల్లీ" అని గుండలవిసిపోగా ఇసకలోకి జారిపోయింది.

* * *

ఆ రోజు నుంచీ అమ్మన్న మంచం దిగడం లేదు. ఎడమవైపు పక్షవాతం వచ్చి ఎడమ చెయ్యి, కాలు పడిపోయాయి. నోరువంకర తిరిగింది. సిటీలో వుంటున్న ఒక్కగానొక్క కొడుకు సూరిబాబుకి కబురువెళ్ళింది. కానీ అక్కణ్ణించి కబురూ, కాకరకాయలేదు. మనిషి అసలు పత్తానే లేదు. వూళ్ళో వుంటున్న వరసకు చెల్లెలు సుబ్బమ్మ వచ్చి అమ్మన్నకు అన్నీ చూస్తోంది.

ఆ రోజు–ఆచారి ఇచ్చిన పసరు నోటికి రాసి పడిపోయిన కాలు, చెయ్యి తోముతూ మంచంపట్టిన తల్లిని పలకరించడానికి రాని సూరిబాబుని ఈసడిస్తూ "అటువంటి బిడ్డ వున్నా, లేకున్నా ఒకటే. బిడ్డని కనీ, గొడ్రాలివైపోయావు కదే" అంది సుబ్బమ్మ.



ఎవరైనా సరే, కొడుకుని పల్లెత్తుమాట అంటే అమ్మన్న ఒప్పదు.

మంచం ఎక్కి వారంరోజులు దాటుతున్నా, ఒక్క ముక్క మాట్లాడని అమ్మన్న. ఆ మాట వినగానే నోరు కదిలించింది. ఎండిన పెదవే అయినా, వంకర తిరిగిన నోరే అయినా, స్పష్టంకాని అక్షరాలే అయినా సుబ్బాలూ–సూరి పండుని ఏం అనకే. నా బిడ్డ తల్లిఋణం పుట్టగానే తీర్చేసుకున్నాడు. మీ బావతో ఈ ఇంటిగడప తొక్కి తొమ్మిది సంవత్సరాలు దాటుతున్నా– ఏటా కడుపుతో వున్నా ఒక్క కాన్పంటే ఒక కాన్పు నిల్వలేదు. కడుపు శోకంతో ఇలాగే పోతాను అనుకుని ఏడ్వని రోజంటూలేదు. ఆడు నా కడుపున పడి, నా కడుపుని పండించాడు."

"చాల్లే అక్కా బిడ్డ మీద అంత భ్రమ పనికిరాదు. వాడికి ఎంత చేశావు. బావపోతే మగాడిలా రెక్కలు విరుచుకు కష్టపడి వాడికి రెక్కల్ని ఇచ్చావు. వాడి వుద్యోగం కోసం అంటూ వున్న నాలుగెకరాల్లో మూడు అమ్మేశావు. నచ్చినపిల్ల అంటే 'గోత్రం' చూడకుండా పెళ్లిచేశావు. కొడుకు దగ్గరకు గంపెడాశతో వెళితే – నిన్ను ఏం చేశాడు. నీ కిక్కడ గాలి, వాతావరణం సరిపడదు అమ్మ– మనూళ్ళోనే వుండు అంటూ చల్లగా తోసేశాడు. ఇక్కడకు వచ్చి ఇన్ని ఏళ్ళువుతున్నా ఒక వుత్తరం ముక్క, ఏనాడైనా రాశాడా? ఈ రోజు నువ్విలా మంచం ఎక్కినా, చూసే నాధుడు లేకుండా పోయాడు కదా–కన్నతల్లి ఋణం ఏం తీర్చుకున్నాడు వాడు. చెప్పు అంది ఈసడింపుగా.

నీకు తెలీదే. మిగతా తల్లీ బడ్డల సంగతి నాకు తెలీదు కానీ. నా బిడ్డ మాత్రం తల్లి ఋణం వుంచుకోలేదు. వాడు – నా ప్రేగుని తెంచుకుని, భూమ్మిద పడి నోరారా ఏడ్చి– నా చనుపాలని చప్పరించినప్పుడే తల్లి ఋణం తీర్చుకున్నాడు... నా కళ్ళల్లో చూపు నిలిపి నోటినిండా బోసి నవ్వుల్ని పూరించి, బుజ్జి చేతుల్ని నా కోసం చాచినప్పుడే వాడు తల్లి ఋణం తీర్చుకున్నాడు... కిలకిలా నవ్వుతూ గుప్పిళ్ళు బిగించి, నా మొహం మీద ముద్దర్లు వేసినప్పుడే తల్లిఋణం తీర్చుకున్నాడు. ఒడిలోంచి, ఎగబడి పొట్టమీదుగా చిన్ని చిన్ని పాదాలతో తొక్కిపెడుతూ–పైకెక్కి తన బుజ్జి బుగ్గల్ని నా చెంపలకి అదుముకున్నప్పుడే తల్లిఋణం తీర్చేసుకున్నాడు. మొలకి కట్టిన మువ్వల్ని గలగలలాడించుకుంటూ, గబగబా పాకుతూ, దోగాడుతూ వచ్చి నా చీరకుచ్చిళ్ళని గుప్పిళ్ళతో పట్టుకుని లాగినప్పుడే తల్లి ఋణం తీర్చుకున్నాడు.

పలకా బలపం తీసుకువెళ్లి, అయ్యవారి దగ్గర అక్షరాలు నేర్చుకుని– అమ్మ చూడే నిన్ను రాశాను అంటూ నా పేరు రాసి గర్వంగా చూపించినప్పుడే తల్లిఋణం తీర్చుకున్నాడు. ఇలా ఎన్నెన్ని చెప్పను వాటి ముద్దులు... అనుకుంది మమతగా.

మంచం పక్కగా వున్న కిటికీలోంచి దొడ్లోకి చూసింది. దూరంగా కిట్టమ్మ నల్లనయ్యని చూస్తూ పాలని చేపుతోంది. పాలేరు రంగడు పాలు పితుకుతున్నాడు. నల్లనయ్య సుడిగుండంలో ప్రాణాలువిడి చేశాక. దాన్ని బయటకు తీసి– దాని చర్మం ఒలిచ్చి ఎండబెట్టి లోపల దూది, గడ్డి కూరి పైన అలాగేచర్మం కుట్టి కాళ్ళకి నాలుగు కర్రలు కట్టి నిల్చోపెట్టి చేటపెయ్యగా చేశారు. ఆ రూపం, వాసన చూసుకుని బిడ్డ బ్రతికే వుందనే భ్రాంతితో బతుకుతూ కిట్టమ్మ ఆవు పాలని చేపుతోంది. అది చూసి అమ్మన్న కళ్ళల్లోంచి జలాజలా నీళ్ళు రాలాయి.

అమ్మన్న కన్నీళ్ళు చూసి సుబ్బమ్మ కంగారు పడుతూ ఏంటే బాధగా వుందా? అంది.

అమ్మన్న తల అడ్డంగా వూపుతూ బిడ్డపోయినా బ్రతికుందనే భ్రాంతిలో వున్న కిట్టమ్మ కన్నా నేను నయమే కదే. నా బిడ్డ ఎక్కడో దూరంగా, సుఖంగా, సంతోషంగా వున్నాడు. తల్లికి అంత కన్నా ఏం కావాలీ? దూరంగా వున్న సుఖంగా సంతోషంగా వున్నాడనే భావన తల్లి ప్రాణానికి ఎంత సంతోషాన్ని ఇస్తుందో తెలిసే–" అంది.

సుబ్బమ్మ విసుక్కుంటూ నీదంతా చాదస్తంలే. వాడికసలు నువ్వు బ్రతికున్నావో, చచ్చావో కూడా పట్టదు- అంది. ఆ మాటకి అమ్మన్న ప్రాణం గిలగిల్లాడి పోయింది. మోహం ఎర్రబార్చుకుంటూ సూరిబాబుని ఏం అనకు. పాపం వాడికి ఎన్ని పనులు ఎంత చాకిరి.. వాడు అవన్నీ వదులుకుని నన్ను చూడడానికి వచ్చి ఇబ్బంది పడేకన్నా- రాకుండా సౌకర్యంగా వుంటే చాలు. ఇక నువ్వు వాడి మాట ఎత్తకు. అంది.

సుబ్బమ్మ 'నీ చాదస్తం నీదే'. అన్నట్టుగా ఒక చూపు చూసి లేచి వెళ్ళిపోయింది.

* * *

మరో నెల రోజులు గడిచాయి. అమ్మన్న కాస్త లేచి కర్ర వూతంగా ఈడ్చుకుని తిరగ్గలుగుతోంది. మధ్యాహ్నం అన్నం కలుపుకుని, కృష్ణ పరమాత్మని తలచుకుని, భర్తని తలుచుకుని మొదటి ముద్ద, పెరటి గోడ మీద అరుస్తున్న కాకికి పెడుతూ పొద్దుట నుంచీ ఒకటే అరుస్తున్నావు. మనింటికి ఎవరు వస్తారే అని ముద్దుగా విసుక్కుంది. ఎక్కడో కొడుకు వస్తాడేమోననే భ్రాంతి మనసులో. మళ్ళీ వెళ్ళి అన్నం ముందు కూర్చుందో లేదో బయట కారు ఆగిన శబ్దం. లేచి వచ్చేసరికి ఎదురుగా గుమ్మం మెట్లు ఎక్కుతూ నిలువెత్తు కొడుకు అమ్మన్న శరీరం ఆపాదమస్తకం వణికింది. గొంతు గద్గదమైంది. "సూరిపండూ ఎలా వున్నావురా" అని మాత్రం అనగలిగింది.

ఏభై ఏళ్ళు దాటుతున్న సూరిపండు ఆయాసంగా వచ్చి వీధిలో వున్న వుయ్యాలబల్ల మీద కూలబడుతూ ఏదో ఇలా వున్నాలే అన్నాడు నిరాసక్తంగా. ఆ మాటకే అమ్మన్నగుండె నీరు కారిపోయింది. "ఏంట్రా బాబూ అలా అంటున్నావు-" అంది

"అమ్మా-నీకు తెలుసు కదే. చిన్న బాబుని ఎంతో గారాబంగా పెంచానో. రక్తం పిండి వాణ్ణి చదివించి అమెరికా పంపాను. వచ్చాక ముసలివయసులో నాకు తోడుగా వుంటాడనే కదా. నా వ్యాపార వ్యవహారాలు లావాదేవీలు చూస్తాడనే ఆశతో వున్నా. ఇప్పుడు వాడు నా నెత్తిన చన్నీటి కుండబోర్లించాడు ఇలా అంటున్నప్పుడు దుఃఖంతో సూరిబాబుగొంతు వణికింది.

'చిన్నాడు ఏమన్నాడురా...' ఏం వినాల్సి వస్తుందో అని భయపడుతూ, భయపడుతూ అడిగింది.

"వాడికి మేం పనికి రామట. మేమేకాదు ఈ దర్టీ ఇండియా కూడా. అక్కడే పారిస్‌లో సెటిలయ్యి- అక్కడి పిల్లనే కట్టుకుంటాడట. ఈ మాటలు అంటున్నప్పుడు ఒక్క క్షణం కూడా కన్న తల్లిదండ్రుల గురించి ఆలోచించలేదు. వాడు లేకపోతే నేను వుండలేను అమ్మ.." అని మాట్లాడలేక ఆగి.. కాసేపు నిశ్శబ్దం తర్వాత.. ఇప్పుడు వాడు వచ్చి అక్కడ మనింట్లోనే వున్నాడు. రేపు వెళ్ళిపోతాడట. ఎన్నో చెప్పి చూశాను. వినలేదు. నువ్వు అంటే వాడికి ప్రాణం. పోనీ నువ్వు చెబితే వింటాడేమో అనే ఆశతో.. నిన్ను తీసుకువెళదామని వచ్చాను. అని ఆగాడు.

మెల్లమెల్లగా కొడుకు మాటలకి అర్థం బోధపడి అమ్మన్న కళ్ళల్లో నీరు నవ్వింది. ఆ కన్నీటి నవ్వు-

నా కన్నకొడుకే, నన్ను అర్థం చేసుకోలేక నన్ను దూరంగా వుంచేస్తే మౌన యోగం చేస్తూ కన్న బిడ్డ జ్ఞాపకాల ధ్యానంలో జీవితాన్ని వెళ్ళమారుస్తున్న నేను నీ కన్న కొడుక్కి ఏం చెప్పి ఒప్పించగలను- అన్నట్టుగా వుంది.

మౌనంగా వున్న తల్లి మోహంలోకి చూస్తూ "ఏమ్మా! మాట్లాడవు. నాతో నువ్వు రావాలి. వచ్చి వాడికిగట్టిగా నచ్చచెప్పాలి. నీ మాట కాదనడు-" అన్నాడు వత్తి పలుకుతూ.

అమ్మన్న కళ్ళల్లో నిండిన కన్నీరు జలజలమని బుగ్గల మీదుగా రాలుతూ నేల తల్లిని పలుకరిస్తూ - చూశావా కన్న తల్లిని కాదనుకున్న కొడుకు- తనకి దక్కకుండా పోతున్న కొడుకు కోసం ఏడుస్తున్నాడేగాని - తన తల్లి కన్నీటి జాడని గుర్తించాల్సి వస్తుందని మోహం తిప్పుకుంటున్నాడు అన్నట్టుగా వుండిపోయాడు. కన్న హృదయం చిత్రమైంది.

గుండెల నిండా ఎన్నో కలలు పొదువుకుని, కొడుకు దగ్గరకు వెళితే- కొడుకు మొహం చాటేసుకుని ఇక్కడ నువ్వుంటే నీకు ఇబ్బందే. మాకూ అడ్డంకే. చక్కగా మన పల్లెలో నీకు బావుంటుంది. నీ ఆరోగ్యం అక్కడి గాలికి కుదుటపడుతుంది. అంటూ మెత్తగా ఇంటి నుంచి వెళ్ళగొట్టినప్పుడు కూడా అమ్మన్న కళ్ళని కన్నీటి చుక్క పలకరించలేదు.

వార్థక్యం మీదపడి, శరీరం ఇక పని చెయ్యను అని మొరాయిస్తున్నా- కొడుకు గురించిన జ్ఞాపకాలని కలలుగా మార్చుకుని- మౌనంగా జీవితం గడుపుతూ- 'దేవుడి పిలుపు' కోసం నిబ్బరంగా ఎదురుచూస్తూ పండిన జీవితంతో గుంభనంగా వుండే కానీ 'అమ్మా' అని పలకరించడానికి కూడా కొడుకు రావడంలేదని హృదయాన్ని దుఃఖపెట్టుకోలేదు.

నిండుమాసాలు మోసి, ప్రాణాన్ని పణంగా పెట్టి కని, తన శక్తిని హారతి కర్పూరంలా కొడుకు జీవితంలో వెలుగు కోసం కరిగించుతూ- శక్తి వుడిగి ముదివగ్గు అయిన తనకు కొడుకు చాకిరీ చెయ్యాలని, తల్లి ఋణం తీర్చుకోవాలని ఏనాడూ ఆశించకుండా కొడుకు బాగుకోసం ఆశీర్వచనాలు మంత్ర ప్రవచనంలా ముమ్మారు మనసులో మననం చేసుకునే అమ్మన్న కొడుకు కున్న కలవరం దుఃఖం చూసి- తన అనుభవానికి వచ్చిన వేదనే కొడుక్కూ వచ్చిందనే దుఃఖంతో ఆవిడ పండినకళ్ళు నీటి చెలములయ్యాయి.

"అమ్మా! నువ్వు రాకపోతే నా మీద ఒట్టే" అంటున్నాడు సూరిబాబు.

## దీపావళి దివ్య సందేశం

అందరికీ వెలుగిచ్చే
దీపావళి మనకొచ్చె!
జిలుగు వెలుగుల తారావళిలో
జగమే ఊయలలూగే!

నరకాసురు వధియించిన రోజని
అందరు ఆనందించారు!
ఆనందానికి చిహ్నముగా
ఈ దీపాలను వెలిగించారు!

నీలాకాశపు నిశీథిలో
తారాజువ్వలు ఎగిరాయి
చిటపటలాడే పువ్వులు చూచి
చిన్ని హృదయాలు పొంగాయి.

సీమ టపాకా మ్రోతల్లో
చిచ్చుబుడ్ల ఆ కాంతుల్లో
ఏదో నూతన తేజం!
ఏదో దివ్య సందేశం!!

ఆ తేజంలో వెలుగు
ఆ సందేశంలో విలువ
సాటివారికి చాట చెప్పండి
ఉత్తేజితులై లేచి నిలువండి

ఈ దీపాలే దివ్యజ్యోతులై
భారతాంబ కీర్తి యశస్సుల
నలుదిక్కుల. చాటేనూ
నలువైపుల ప్రాకించేనూ

అనంతమౌ ఆకాశంలో
నిప్పురవ్వలు ఆడాయి
ఆ రవ్వల కాంతుల్లో
మా పాప ముఖంనవ్వింది

పాప చేతిలో కాకరపువ్వు
పటా టోపంతో వెలిగింది.
ఆ కెలుల కాంతిని చూసి
పకపకమని నవ్వింది

చిన్నిపాప నవ్వుల్లో
కాకరపువ్వుకాంతుల్లో
ఏదో నూతన తేజం!
ఏదో దివ్వెల సందేశం!!

— వి.మంగతాయారు

